కథానిక :

# "ఆడపిల్ల"

శ్రీ ఆయపిళ్ళ సత్యనారాయణమూర్తి

తొలిసారిగా ఆడపిల్ల పుట్టినట్టు అత్తవారి ఊరినుండి ఉత్తరం వచ్చింది.

అమ్మమ్మ మొహం చేటంత వెడల్పయ్యింది. "సంచీ జాగ్రత్త చెయ్యరా కూతురు పెళ్ళికి"— అని హుషారిచ్చింది.

నాకు తప్పకుండా ఆడపిల్లే కలగాలని ఆమెకు మొదట్నుంచీ కోరిక.

ఆడపిల్ల కలిగితేనేగాని కష్టాలు తెలుసుకురావనీ— అప్పటితోగాని బుద్ధిమంతుడనయి కాస్త జాగ్రర్తగా సంసారాన్ని సాగించనని ఆమె భావం.

అయితే సంసారము చేయడములో విరుద్ధం యేమీ నాలో లేదు. పోతే- నేను స్వయానా మార్కెటుకు వెళ్ళడమూ, కానీ—పరక దగ్గరనుండి కూరలు బేరమాడి అవన్నీ భుజంమీద వేసుకురావటమూ నాకు తెలియదు.

కావలసిన దినుసులుగాని, కాయగూరలుగాని— పద్దులు వ్రాసి దుకాణానికి యిచ్చేస్తే, సామానులు సురక్షితంగా యింటికి వచ్చేస్తవి. ఒక అణా-బేడ కూలి కోసం- స్వయంగా మార్కెట్టుకు వెళ్ళడమూ- అనవసరంగా గంటా- గంటన్నర కాలం బేరసారములతో వృధాపరచడమూ నాకు సమ్మతం కావు. ఈ కాస్త వ్యవధియే నా సారస్వత సేవకు అమూల్య అవకాశం.

ఈ విషయంలో శ్రీమతి కూడ నాతో ఏకీభవించినందుకు నేను ధన్యుడననే చెప్పాలి.

"ఏమి బేరములులెస్తురూ- కానీ పరక డబ్బులు కోసం. ఈ కాస్త టైములో కూడ మీరు ఇంటిపట్లున ఉండకపోతే వీలులేదు" అంటుంది.

ఇట్లా సంసారము సాగించడములో నా అజాగ్రతకు శ్రీమతికూడ ఓకారణమని అమ్మమ్మ మా ఇద్దరిపైనా ఏవిధముగానైనా శిక్షవిధించాలనే కోరికతో చాల కాలం నుండి కాచుకునివుంది.

ఆమె దీర్ఘకాలపు వాంఛ కొనసాగింది. ఆమె కోరిక ఫలించింది. అందుకనే ఆమె మొహం పొంగి చాటంత వెడల్పయింది.

బాలసారెకు ప్రయాణం అయి వెళ్ళబోతూవుంటే- అమ్మమ్మ తను చేయించిన "సిగ్గుబిళ్ళ" ఒకటి యిచ్చింది. "ఇది పిల్ల మొలకు కట్టు— పేరు పెట్టేటప్పుడు మీ అమ్మమ్మను మరిచిపోకు!" అంది.

మా ఇంటి ఆశాజ్యోతి పాపాయిని చూచాను. పసిడి బొమ్మల్లెవున్నది! నన్ను చూచి చక్కటి నవ్వు నవ్వింది. తొలిసారిగా ఆ చిన్నినోటిలో నా నోరు పెట్టి ముద్దాడాను. నా హృదయం ఉప్పొంగింది. పురిటాలి కళ్ళు ఆనంద జలమయమయినాయి.

"ఎంత బావుందేం!" అన్నాను.

"తీసికోండి!"

"మరి నీకు?"

"పాపాయికి దాదిగా వచ్చివుంటాను"—

ఇద్దరమూ నవ్వుకొన్నాం.

తిరిగి ఊరికి చేరుకున్నాం. దిష్టితీర్చి అమ్మమ్మ మునిమనుమరాల్ని ఎత్తుకుంది. "పేరు ఏమి పెట్టినార్రా?" అని ప్రశ్నించింది.

"ప్రస్తుతం పేరు పాపాయి"—

"పాపాయి పేరేమిట్రా! ఛఛ!.... బాగోలేదు" అంది.

"మాకు పాపాయే! నీకు నీ యిష్టమొచ్చింది పెట్టి పిలుచుకో"

"బాగున్నదర్రా- ఎవరి ఇష్టమొచ్చినట్లు వాళ్ళు పిలుచుకుంటే- పెళ్ళినాడు మొగుడు యేమని పిలుస్తాడు?—

"తనిష్ట మొచ్చింది పిలుచుకుంటాడు"—

అమ్మమ్మకు ఓ విధంగా మా మీద మంచి కోపం వచ్చింది.

"మన యింట ఇలాటి అపచారాలు ఎప్పుడూ చేయ బోకండి— సలక్షణంగా పిల్లలకు బాలసారనాడు పేరు పెట్టుకోవడమూ, ముద్దుగా పిలుచుకోవడమేగాని- ఇలాటి ఓఘాయిత్యం ఎప్పుడూ జరగలేదు— జరుగకూడదు కూడాను. మా అమ్మపేరు పేరమ్మ. నాపేరు పేరిందేవి. మా అమ్మ నెరుగవుగాని- నూరేళ్ళు బ్రతికింది. పిల్లలకు పెద్దల పేర్లు ఎందుకు పెడతారు. వచ్చే ఏకాదశికి సత్య నారాయణ వ్రతం చేసుకుని పిల్లలకు నిక్షేపంలా పేరు పెట్టండి"— అని లెక్చరిచ్చింది.

ఏమయినా, పాపాయి- పాపాయి పేరుతోనే వుండి పోయింది.

అమ్మమ్మ కోరినట్టుగ పాపాయి పుట్టుకతో నాకేమీ నడ్డి విరగలేదు.

ఆఫీసు పని తెరిపి చేసుకుని— ఇంకా కాస్త పెందరాళే యింటికిచేరుకుంటున్నాను పాపాయితో ఆడుకునేందుకు. ఇంక- ఆఫీసుకు బైముకు వెళ్ళనీయకుండా అయస్కాంతం మల్లే పట్టుకునేది పాపాయి.

పాపాయి బహు ముద్దుగా పెరుగుతూంది. ఆడపిల్ల పుట్టిన వలననే అమ్మమ్మ కోరిక మాత్రం చెల్లిందిగాని- ఆమె ఆశించినట్టు కష్టాలేమీ నా మీద విరుచుకుపడలేదు.

కూరలూ, దినుసు సామాన్లకు వెళ్లే అరువు చీటీలతో పాటు అధికంగా మెడికల్ షాపుకు మరొ ఒక నెలవారీ చీటీ వెళ్తూంది పాపాయి చిట్టి మందులకు.

పాపాయి దిన దిన ప్రవర్ధమాన మవుతూనేవున్నది. బంగరడాలు, చిట్టి చిట్టి నడకలు,— లేతనవ్వులు. పాల బుగ్గల ఎరుపులూ- చిలుక పలుకులూ- ఎదిగి - ఎదిగి పాపాయి ఎనిమిది సంవత్సరాల అమ్మాయి అయ్యింది.

ఈ ఎనిమిది సంవత్సరాలకే అమ్మాయి నా నుండి తను వేరు అయ్యింది. అప్పుడే ఆ పసి అమ్మాయి తన సామానులూ అన్నీ వేరు వేరుగా చేసుకుంది. వేరుగా పెట్టె- పెట్టెలో తన బట్టలూ పుస్తకాలూ. తనకో చిట్టి కంచమూ, చిట్టి మంచమూ. ఇట్టా అమ్మాయి, నానుండి- తన తల్లి నుండి అన్నీ వేరు వేరుగా చేసుకున్నది. ఎందుకని ?— అమ్మ ప్రక్కమీద తను పడుకొనే జాగాలో క్రొత్తగా వచ్చిన తమ్ముని చూచి- ఏమని అను కుందో ఏమో ఆ లేతహృదయం ! దగ్గరకు రావటమే మానుకుంది. ఎల్లప్పుడూ తన చదువూ, ఆటలూ, పాటలూ ఇంకా బైము మిగిలితే తమ్ముని ఆడించటమూ- అమ్మకు ఇక్కడా- అక్కడా పని సాయం చేయటమూ. ఒక్క నిముషమన్నా తీరికలేకపోయింది అమ్మాయికి నావద్దకు వచ్చేందుకు.

ఇదివరలో నేను బజారుకు వెళ్తున్నప్పుడు ఎన్నో పురమాయించేది తనకు అది కావాలనీ- ఇది కావాలనీ-

ఇప్పుడు నేను పిలిచి అడిగినా— "అబ్బే ఏంకావాలి ? ఏమీ అక్కర్లేదూ !" అనేస్తుంది. వెర్రి తల్లి.... ఎంత మార్పు !

బిస్కత్తులు బజారునుండి తెచ్చి- నీవు సగము తీసు కుని తమ్మునికి సగము యియ్యవమ్మా అలాగే అని పుచ్చుకుని రెండువంతులూ తమ్మునికి బుజ్జగించి మేపు తుంది ఎక్కడనుంచి వచ్చిందో ఈ ఆడపిల్లకి ఆజ్ఞానం !

స్కూలులో అన్నీ ఫస్టుమార్కులేనట ! మొగకుర్ర వాళ్ళను మించి చదువుతుందట !—

"మీ అమ్మాయి యెడల మీరు చాల శ్రద్ధ తీసుకుం టారండీ. అందుకనే ఫస్టు మార్కులు వస్తాయి" అని టీచర్లు సహితమూ అంటారు.

నిజానికి అమ్మాయి నాదరికేరాదు—

ఎప్పుడయినా దగ్గరకు తీసుకోబోతే సిగ్గుపడిపోతుంది వెర్రి పిల్ల !— నాదగ్గరనే రాత్రిం పగళ్ళు వుండి- నేను ఇంటిదగ్గరవున్న కాలంలో క్షణంకూడ నన్ను విడచి వుండని చిట్టి అమ్మాయి- తన తమ్ముని పుట్టుకతో దూర మయిపోయింది !—

తనకూ, తన మాతా పితలకూ ఆ మగకుర్రవాడే అడ్డుగోడ అనుకున్నదో యేమో !—

ఆమె నాదగ్గరకు రాకపోవడము- భయమో- కోపమో మరేమో అనుకున్నాను.

ఏమీలేదు. ఓనాడు ఆమె క్లాసు మాస్టరు దారిలో కని పించి అమ్మాయి "తలిదండ్రుల"గురించి వ్రాసిన వ్యాసం చూపించారు. క్లాసులో ప్రథమబహుమానం పొందినదట !

ముత్యాల కోవల్లె అక్షరాలు- తండ్రిని గురించి ఆమె వ్రాసింది : "తండ్రి దైవము- ప్రత్యక్ష దైవము నిత్య

ముగా మనము చూచు మన తలి దండ్రులే. ఇంటికి పెద్ద తండ్రి. ఇంటి వెన్నెముక తండ్రి. ఇంటి గౌరవము తండ్రి. తండ్రి కష్టించి ఆర్జనచేస్తే— తల్లి ప్రేమ పూర్వకముగ వొండి పెడుతుంది".... వ్యాసం చదువుతుంటె కళ్ళు జలమయ మయినాయి. కాగితం మడిచి మేష్టరు చేతికిచ్చాను. నా వెర్రి తల్లికి తండ్రి అంటే అంత గౌరవమా! తండ్రినయి వుండీ ఆమెకు అవన్నీ నేను చేశానా.... పాపిని.... ఈమధ్య ఒక్కనాడూ ఆ చిట్టి అమ్మాయిని హృదయం దగ్గరగానైనా తీసుకు ఎరుగను. ఆ చిన్ని హృదయం ఎంత విశాలమో.... నాతప్పులన్నీ కప్పిపుచ్చి నాకు లేని గౌరవాన్ని తెచ్చిపెట్టి ఏవేవో వ్రాసింది.

దారిలో పోతూనే అమ్మాయికి ఓ సిల్కు పరికిణీ— జాకెట్టు కొని తొందరగా యింటికి వెళ్ళాను. నా చిట్టి పిల్లను దగ్గరగా తీసికోవాలని.

"పాపాయి ఇట్లా రావమ్మా" అన్నాను.

పాప దూరంగా వచ్చి నించుంది.

"వ్యాస రచనలో ఫస్టు ప్రయిజు వచ్చిందట!"

పాప నవ్వి ఊరుకుంది.... నిండుకుండ నా పాపా!

"చెప్పవమ్మా! పోనయితే— ఇదిగో నీకు నేనూ ఓ బహుమానం తెచ్చాను."

పరికిణీ - జాకెట్టు చూపాను. "రా.... ఇట్లా రాతల్లీ! నే తొడిగిస్తాను"

"ఇట్లా యిచ్చేయండి— నేనే తొడుక్కుంటాను"

అమ్మాయి దగ్గరగా రాలేదు ... నా హృదయంలో కోరిక తీరలేదు. గుండె వేగం ఆగలేదు.

గట్టిగా ఆ చిట్టి బట్టలను హృదయానికి నొక్కుగుని మంచముమీద ఎంతసేపో హాయిగా నిద్రించాను....

*　　　*　　　*

అమ్మాయి స్కూలు ఫైనలుకు వెళ్ళింది. "అమ్మాయి మాట ఏం చేశారు?.... వొంటికి పధ్నాలుగేళ్ళు వస్తున్నాయి" అని నా బుర్రమీద మొట్టి నా అర్ధాంగిగారు తెలియచేసేవరకూ అమ్మాయి వయస్సు నాకు తెలియనే లేదు.

"పధ్నాలుగు ఏళ్ళేకదూ" అన్నాను.

"పధ్నాలుగు కాకపోతే పాతికేళ్ళు రావాల్నేం— మీదగ్గరకు నేను నా పధ్నాలుగో యేటే వస్తి! అప్పటికే నావయస్సు మీరిందని మీ వాళ్ళు అనుకోలా? అట్టే జిడ్డు వోడక తగిన ప్రయత్నాలు చేయండి. లేకపోతే- ఆడదాన్ని నేను భరించడం కష్టం" ఇట్లా ఆమెగారు నాకు సాధక బాధకాలు విశద పరిచారు.

"స్కూలు ఫైనలు అవనీ!"

"ఈలోగా ప్రయత్నాలు చేయండి!"

నాకు ఎరికలో ఉన్న నాలుగు సంబంధాలకూ ఉత్తరాలు వ్రాశాను.

నలుగురూ వచ్చి చూసుకున్నారు.

అమ్మాయికి నచ్చిన సంబంధమే వొప్పుకున్నాను.

అమ్మాయి పేరకట్టిన పెళ్ళి భీమా సొమ్ము సరిఅయిన టైములో అందింది.

పెళ్ళి వైభవంగా జరిగిపోయింది.

అమ్మాయి పెళ్ళి జరగటంలో ఇసుమంతయినా నాకు కష్టం జరుగలేదు.

అమ్మాయి వెళ్ళిపోయిన లోటు మట్టుకు నన్ను వేధించింది. అమ్మాయి ఇంట్లో తిరుగుతూవుంటే యిల్లు నిండుగా కనుల పండువుగా వుండేది.

ఒక్క నగ పెట్టుకుంటే లక్ష్మీదేవి అనిపించింది.

లక్ష్మిలేని నా యిల్లు అంధకార మయమయింది, నా హృదయంలో ఈ అజ్ఞాత అంధకారం వొరులు గ్రహించలేరు.

నా లక్ష్మి వేరొక ఇల్లు కూడ చూచుకుంది. వేరొక ఇంట్లో నా లక్ష్మి కాపరం చేస్తోంది. వారి యిల్లు నిత్య కల్యాణమై — పచ్చతోరణమై ఉండుగాక—